# అంతరం

'తెలుగు వెలుగుల మూర్తి కళా నిక్షిప్త ప్రాంగణం'. అంబేద్కర్ ఎడమచేతివైపున్న ప్రాంగణ తోరణం దాటాక, టాంక్‌బండ్ కుడివైపున తెలుగు వెలుగుల మూర్తులు - వివిధ భంగిమల్లో స్వారీచేస్తూ, కూర్చునీ, నిలబడీ. మొల్ల విగ్రహానికి కుడివైపున నాలుగు వేపచెట్లు, ఆ చుట్టూ గడ్డిమీద నింపాదిగా కబుర్లలో జంటలు కూర్చొ.. ఆటల్లో పిల్లలు నిలబడలేకుండా, పల్లీలో అవో ఇవో తిని పారేసిన నలిగిన కాగితాలూ, కాగితాల ఉండలూ అక్కడా ఇక్కడా, సాయంకాలపు గాలికి కదులుతూ రోడ్డుకు అటువైపు కొబ్బరి బొండాలు, చెరుకురసం అమ్మకాలు మొల్ల విగ్రహం కింద దెబ్బతిన్న అరుగు, అక్కడ ఏదో తవ్వకం పని జరిగింది. మట్టి మేటల వరసలు తవ్వకాల దారి తవ్వకాలది; పూడ్చటాల దారి పూడ్చటాలది.

మొల్ల విగ్రహంపై పడుతున్న కావిరంగు వెలుగుల్ని, నీడలు క్రమంగా కమ్ముకుంటున్నాయి. విగ్రహం దిగువ అంతర కూర్చుంది- మోచేతులు చున్నీ, చుడీదార్ కప్పిన తొడలమీద ఉంచుకుని, అరచేతులతో చెంపలు కప్పుకుని, కళ్లు అటూ ఇటూ తిప్పుతూ. నీచుగాలికి జుట్టు కదలాడుతోంది. కాలుష్యపు నీటి వాసనలు . . . శివమోహన్ కోసం అంతర ఎదురు చూస్తోంది. శివమోహన్ ఇంకా రాలేదు.

అంతర హుస్సేన్‌సాగర్‌ను కలయజూసింది. ఎంతసేపని? విసుగేసి, పక్క కాస్త దూరంలోని జంటల్ని చూసింది. ముచ్చటగా కనిపించారు. గెంతులేస్తున్న పెద్ద పిల్లల్ని చూసింది.చిన్న పిల్లల తప్పటడుగుల్ని గమనించింది. వాళ్ల ఆహ్లాదానికి అంతర పరవశించిపోయింది. జంటలవైపు మళ్లీ తేరిపార చూసింది. ఒక చెట్టు మొదట్లో కూర్చున్న యువతీ యువకుల్ని పరిశీలించింది. చేతుల్లో ముఖం కప్పుకుని, యువతి ఏడుస్తున్నట్లు కనిపించింది. యువకుడు ఓదారుస్తున్నట్లు కనిపించాడు. 'ఏదో . . . ఏదో చేసి ఉంటాడు. అలుసిస్తే ఈ మగ గాడిదలంతా ఇంతే' అనుకుంది కసితో. చూపు తిప్పి టైం చూసుకుంది.

నడిచి వస్తున్న వాళ్ళను చూసింది. వస్తున్న మగవాళ్లలో శివమోహన్ కనిపించలేదు.

అంతరకు అవ్యక్తమైన దిగులు ముంచుకొచ్చింది. చిరాకు వేసింది. కోపం రగిలింది. కలగాపులగపు ఆలోచనలు వచ్చాయి. శివమోహన్ రావటం ఆలస్యం అవుతూ పోవడంతో, ఆ ఉదయమే చెదిరిపోయిన అంతర మనస్థితి మరింత దుర్భరంగా తయారైంది.

అంతర ఎదురు చూస్తున్న శివమోహన్ రానే వచ్చాడు. వచ్చీ రాగానే, నవ్వుతూ పలకరించాడు. ఆ నవ్వుకు అంతర ప్రతిస్పందించలేదు.

"క్షమించు, అంతరా! ఆలస్యమైంది". కూర్చోటానికి ప్రయత్నిస్తూ శివమోహన్ నిజాయితీ గొంతుతో అన్నాడు.

అంతర దిగ్గునలేచి మెరుపుదాడి చేసింది:

"మగాడివి. నువ్వు వచ్చేవరకూ ఎలాగూ ఈ విగ్రహంలాగా పడి ఉంటాననుకున్నావు?'

"పడి ఉండటమేమిటి ? మొల్ల బుద్ధిగా కూర్చునే ఘంటంతో రాస్తోంది కదా!"

శివమోహన్ హాస్యాన్ని అంతర పట్టించుకోలేదు. తన ధోరణి తనది. నిగ్గదీసి అడిగింది:

"అంటే ఆడవాళ్లం బుద్ధిగా కూర్చుని ఉండాలంటావు? మీ ఎడతెగని రామాయణాలు రాస్తూ ఉండాలంటావు?"

"నేను అట్లా అనలేదు, అంతరా!" ఏ మాత్రం స్వర కాఠిన్యం లేకుండా శివమోహన్ అన్నాడు.

"నువ్వనలేదు, నిజం కావచ్చు! కానీ నీ మనసులో ఉంది అదే. వేరేవిధంగా బయటికి వచ్చింది!"

"అంటే?" శివమోహన్ ఆశ్చర్యపోయాడు.

"అంటేనా?" అయిదూ పదిహేనుకు వస్తానన్నవాడివి ఆరున్నర దాటాక వచ్చావు మాకేం పనులుండవు కదా, క్షణం తీరికలేని ఉద్యోగాలుండవు కదా, ఎదురు చూడక చస్తారా లెమ్మని!"

"అంతరా! అట్లా మాట్లాడకు, నిష్ఠూరంగా! నే నెన్నడైనా అటువంటి మాటలన్నానా? ఈ 1993లో కూడా అట్లా అంటానా?"

" ఏమో ? ఎందుకనలేవు?"

"నీకు తెలియదా? ఆర్నెలలుగా మన పరిచయం. అనలేను. అనను. కానీ ఒకటి నీకు తెలుసు. అయిదు దాటాక బయటపడగల ఉద్యోగం నీది, ఆలిండియా రేడియోలో. పత్రికలో నా పరిస్థితి అట్లాంటిది కాదు. అనుకోకుండా అవసరంకొద్దీ టైము దాటి పనిచేయాల్సి ఉంటుంది. ఈ రోజు, వచ్చేవారం రచనల ఎంపిక పూర్తి చేసి వస్తున్నా . . . కోపం తగ్గితే ఈ తేడా నువ్వర్థం చేసుకోగలవు.

"నే నంటున్నదీ అదే ! మావి ఆడ పనులు. మీవి మగ పనులు. మగ పనులు మాత్రం కాలాతీతమైనవి?" అంతర వ్యంగ్యానికి శివమోహన్ తట్టుకోలేకపోయాడు. అయినా, సహనం కోల్పోకుండా అన్నాడు:

"అది కాదు , అంతరా ! పనుల్లో తేడాలే అన్నాను గానీ, మగ పని, ఆడ పని అని నేను విడదియ్యలేదు గదా ?"

'నువ్వు విడదీసేదేమిటి? లోకంతోపాటు నువ్వూ. మగ పనులు ఎంత గొప్పవి? కాకపోతే, ఇక్కడి 27 విగ్రహాల్లో 25 మగవాళ్లవే ఎందుకుంటాయి? పోతులూరి వీరబ్రహ్మానికెంత

ప్రఖ్యాతి ఉందో ప్రజల మధ్య, ఆయన మనుమరాలు ఈశ్వరమ్మకూ అంతే ప్రశస్తి ఉంది కదా? మరి, ఈశ్వరమ్మ విగ్రహం లేదేం? ముద్దుపళనిది లేదేం? ఇదొక తెలుగు సాంస్కృతిక స్వాగత తోరణం! నువ్వు ఎప్పుడైనా 1986లో వేసిన ఫలకం చూశావా? 'పోతుగడ్డను పునీతం చేసిన మహనీయుల మూర్తి నిక్షిప్త కళా ప్రాంగణం' ఇది అట! పోతుగడ్డట పోతుగడ్డ! పెంటి గడ్డ కాకూడదా?"

"పోతుగడ్డ అనేది తెలుగు నుడికారం, అంతరా! అలంకారికంగా చెప్పేది కూడా. శౌర్యం కలిగిన గడ్డ అనే అర్థంలో ఉపయోగించటం తప్పు కాదు గదా?"

"పోతురాజులకూ, దున్నపోతులకూ మాత్రమే శౌర్యం ఉంటుంది మీ దృష్టిలో అంతేనా? గంగమ్మలకూ, ఎల్లమ్మలకూ ఉండదేమో, మీ ప్రకారం?"

శివమోహన్‌కు అంతర వాదం రుచించలేదు. మాటకుమాట తెగులు, నీటికి నాచు తెగులు అనేసామెత గుర్తొచ్చింది. అనునయపూర్వకంగా అన్నాడు:

"ఈరోజేదో నీ మనసు ఒక రకంగా ఉంది. ఎందుకింత అశాంతికి గురికావడం, అంతరా? మనసు విప్పి చెప్పరాదా? చెప్పకూడని మనిషినా నేను?"

శివమోహన్ మాటలు అంతర అంతర్యాన్ని తాకాయి. ఆ అపేక్షకు కొన్ని క్షణాలు కదలిపోయింది. తన మనసులోని ఆందోళన ఒకటి. పైకి మాట్లాడుతున్నది మరొకటి అని అంతర గుర్తించింది. "కూర్చుందాం!" అంది.

ఇద్దరూ కూర్చున్నాక, శివమోహన్ అడిగాడు:

"ఊఁ చెప్పు, ఎవరితోనైనా ఘర్షణ పడ్డావా?"

"ఘర్షణ పడటం నాకు సరదా అనుకున్నావా? నేను భరించలేనివి రెండే. మగవాళ్ల చర్యలూ, అడ్డదిడ్డం రాతగాళ్ల రాతలూ, 'వరకట్నం హత్యలకూ, దళిత సమస్యకూ ముడిపెట్టడం పచ్చకామెర్ల చూపు అని ఎవడో రాయటం, మీరు అచ్చువేయడం . . . నా కులం తెలిసే గదా ఆ విషపు రాత? మీ పత్రిక అగ్రకులం వాళ్లదాయె!"

శివమోహన్ మతిపోయింది. అంతర ఏ విషయాన్ని ప్రస్తావిస్తోందో శివమోహన్‌కు చప్పున స్ఫురించలేదు. కోపం వచ్చినప్పుడు, అంతర చేసే వాదనలో క్రమం ఉండదని తమ స్నేహమైన తొలి రోజుల్లోనే గుర్తించాడు. కానీ, ప్రస్తావించే విషయాల వెనుక ఉండే అంతర ఉద్వేగమూ, సహజమైన ఆర్తీ అంటే శివమోహన్‌కు గౌరవం. అంతర మనసును కలచివేసిన ఆ రాత ఏమై ఉంటుంది? అని శివమోహన్ జ్ఞాపకం తెచ్చుకోడానికి అవస్థపడ్డాడు. ఒకటి రెండు నిమిషాలు నోరు విప్పలేదు.

అంతర మంటను ఆపుకోలేక అంది:

"అవును. నువ్వు మాట్లాడవు. నువ్వెందుకు మాట్లాడతావు? నువ్వూ అదే జాతి. కులం నిచ్చెనలో నీదీ పై మెట్టేగా!"

"అసలు ఏ విషయాన్ని ప్రస్తావిస్తున్నావో నాకు గుర్తుకు రావటంలేదు. అంతరా ! నీ కోపం ఎవరిమీదో, ఏ రాత మీదో చెప్పు! నిన్ను అర్థం చేసుకోలేనంత మూర్ఖుణ్ని కాదు. ఎవరు రాశారు? ఎక్కడ? దేనిమీద?"

"ఎవరా? నీ గొప్ప మిత్రుడు హరినారాయణ. ఎక్కడా? నువ్వు పనిచేసే పత్రికలోనే. దేనిమీదా? చూళ్లేదా, చూసినా చూడనట్లు నటిస్తున్నావా? ఆ పేజీ నువ్వు చూడకుండానే అచ్చయిందా? ఆ సాహిత్యం పేజీని చూసేది నువ్వు కాదా? నీతో చెప్పకుండా హరినారాయణ రాశాడా? నువ్వు చూడకుండా అచ్చయిపోయిందా? నమ్మమంటావా? రచనల్ని చూడకుండానే

అచ్చు వేసుకుంటారా, మీరూ, మీవాళ్లూ?"

'మీరూ మీవాళ్లూ' అనే మాట మీది నొక్కుడూ, అంతర ప్రశ్నల్లోని ఆగ్రహమూ శివమోహన్‌కు గట్టిగా గుచ్చుకోవాల్సినచోట గుచ్చుకున్నాయి.

హరినారాయణ ప్రస్తావనతో శివమోహన్‌కు విషయం తట్టింది.

"ఈ రోజు మా పత్రికలో అచ్చయిన హరినారాయణ వ్యాసం సంగతా? నీ పద్యాన్ని బాగా మెచ్చుకున్నాడే!"

"ఆఁ, మెచ్చుకున్నాడు, కడుపులో ఇంత విషం పెట్టుకుని. చలం చెప్పినట్లు స్టయిల్‌ను ప్రోత్సహించే నా బాధ . . . మీకు తట్టకపోతే నేను రాసి ఏం లాభం? మీరు చదివి ఏం లాభం?' నా భావాల బలంతో నేను కవిత్వం రాశాను గానీ, శైలి కోసం, పదచిత్రాల కోసం కాదు. అవన్నీ పద్యభావంలో భాగం. రచనను మెచ్చుకుంటూ, భావాల్ని తూట్లు పొడవటమంటే, ఆ ద్రోహం ఎందుకు చేస్తారో మాకు తెలియదా?"

శివమోహన్‌కు అంతర వాదానికి కేంద్రమేదో తెలిసివచ్చింది. "వాడు వరకట్నం హత్యల్ని సమర్థించలేదనుకుంటాను" అన్నాడు.

"అనాగరికులైన మేధావులు సమర్థించినా వచ్చే నష్టమేమీ లేదు." అంతర కరకుదనానికి శివమోహన్ బాధపడ్డాడు. గింజుకున్నాడు. ఆ వ్యాసాన్ని తాను మెచ్చుకునే వేశాడు.

"మరి పేచీ ఎక్కడుంది?"

"పేచీనా? ఆ పద్యం ఎందుకు రాశానో నీకు గుర్తులేదా? నా స్నేహితురాలు నెల కిందట బలి అయినప్పుడు నీతో చెప్పుకున్నానే. ఆ యాతన నీకు గుర్తులేదా? నా స్నేహితురాలి నరకం, దాని చావు, నా దుఃఖం, నా కోపం నీకు జ్ఞాపకం లేవా? అంతర, ఉబికి వస్తున్న తన దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంది.

"నీ సున్నితమైన హృదయం సంగతి నాకు తెలియదా, అంతరా?" శివమోహన్ ఓదార్పు ప్రశ్నలోని ఆర్ద్రతకు అంతర క్షణం చలించింది. అంతలోనే మొండికేసినట్లు తెగేసి చెప్పింది:

"మరి తెలిసే హరినారాయణ వ్యాసాన్ని అచ్చు వేశావు. ఒక దళిత యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడే, ఆ పెద్ద కులం దౌర్భాగ్యుడు ! వాడి తల్లిదండ్రులు ఆ పిల్లను హింసిస్తున్నప్పుడు అడ్డుకోలేనివాడు ప్రేమికుడా ? అసలు మగవాడా? అందరూ కలిసి హత్యచేశారు. అది మీ అందరికీ కేవలం వరకట్నం హత్యగానే కనిపించింది. వరకట్నం ఒక నెపం. అగ్రవర్ణ హింసే అసలు కారణం. నా పద్యంలో కేంద్ర భావం అది. నా గోడు అది. నా ఆయుధం అది . . ."

శివమోహన్ ఆలోచనల్లో పడి బదులు చెప్పలేదు. మొల్ల విగ్రహం దగ్గర సాయంత్రం కలుసుకోవాలని నిర్ణయించుకోటానికి కారణం ఒకటి; ఎదురైన అనుభవం మరొకటి. శివమోహన్ అంతరకు నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తూ అన్నాడు:

"చూడు, అంతరా! హరినారాయణకు సమస్య వెనుక కనిపించిన అసలు కారణం డబ్బు. వాడి వ్యాసం చదివినప్పుడు నాకూ అదే కనిపించింది పోనీ . . . అదొక దృక్పథం అనుకో! ఆ దృక్పథంతో శత్రు వైరుధ్యం అవసరమనుకోను".

"శత్రు వైరుధ్యం, మిత్ర వైరుధ్యం . . . మీ పడికట్టు మాటల మీద నాకు నమ్మకం పోయింది. మీకు మాటలే తెలుసు, జీవితం తెలియదు."

"పోనీలే, మనిద్దరి వాదాలూ ఇప్పటికిప్పుడు తేలేవి కావు. మన పెళ్లయ్యాక కూడా

కొనసాగించవచ్చు. ఏమో నీ దారికే నేనొస్తానో? నా దారికే నువ్వొస్తావో?" వాగ్వివాద వాతావరణాన్ని చల్లబరిచే ఉద్దేశ్యంతో శివమోహన్ పరిహాసమాడాడు.

"మన దారులు కలవవు?"

అంతర అన్న ఆ రెండే రెండు ముక్కలకు శివమోహన్ అప్రతిభుడయ్యాడు. మనసు కూడగట్టుకుంటూ అన్నాడు:

"నాలో లోపాలుంటే దిద్దకూడదా? దిద్ది నన్ను ప్రేమించకూడదా?"

"దిద్దటం, ప్రేమించటం, దిద్దటం . . . కుక్కతోకల్ని సరిచేయటమా?"

"మావి కుక్కతోకలైతే, మీ స్త్రీవాదులవి. . ."

"మాట తడుముకోవట మెందుకు? నీ బుద్ధి తెలిసింది, చాలు?" అంతర విసురుగా లేచి, తన నీలిచున్నీని మెడ చుట్టూ వేసుకుంది.

శివమోహన్ చివరి ప్రయత్నం చేశాడు:

" ఎదురు మాటకు క్షమించు, అంతరా! కాసేపు కూర్చుందాం ! రెండు కొబ్బరి బొండాలో, రెండు గ్లాసులు చెరుకురసమో తెస్తానుండు . . ."

"తాగి పారేసే కొబ్బరి బొండాంగానో, రసం తీసిన చెరకు పిప్పిగానో నేను మారదలచుకోలేదు. థాంక్స్? అంతర ఎడమవైపు విసవిసా నడిచింది.

శివమోహన్ విస్తుపోయాడు. నిస్తేజుడయ్యాడు. లేచి, అంతరను అనుసరించి వెళ్లలేకపోయాడు. పరాజిత మనస్సుతో, విద్యుత్ కాంతుల్నీ, కాంతుల మధ్య నీడల్నీ చూస్తూ కూర్చున్నాడు- హుస్సేన్‌సాగర్ నీటి కాలుష్యపు గాలుల మధ్య. అంతర హృదయంలోకి చొచ్చుకుపోగలిగిన శక్తి తనకు లేదేమోనని మథనపడ్డాడు. అంతర లేవనెత్తిన సమస్యను గురించి ఆలోచించసాగాడు. 'అంతర చెప్పింది ఒక విధంగా నిజమే' అని గొణుక్కున్నాడు.

అంతర 'ప్రాంగణం' దాటి, బస్టాపువైపు నడుస్తూ అనుకుంది తన హృదయం, తన మనసు, మాట ఎప్పుడూ ఎందుకువినవని? శివమోహన్‌కున్నపాటి సంస్కారం చాలామందిలో తను చూడలేదు. శివమోహన్‌కు దూరమవుతున్న తనలో ఏదో వెలితి ఆవరిస్తున్నట్లు అంతర అనుకుంది, మరింత వేగంగా ముందుకు నడిచింది తన బస్సుకోసం. ○

● 20 మార్చి 1996, రచన సచిత్ర మాసపత్రిక ●